TEL : T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను, తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..

మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

సంపుటి : 01 సంచిక : 259 | ఆదివారం ,మే 25 ,2025 | పబ్లిషర్ హైదరాబాద్ | పేజీలు 5 | వెల-5


# హైదరాబాద్ సమీపంలో డ్రై పోర్టు ఏర్పాటు చేస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి

» నీతి ఆయోగ్ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీతో ప్రత్యేకంగా చర్చించారు.
» హైదరాబాద్ మెట్రోకు త్వరగా అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.
» పట్టణాభివృద్ధి శాఖను మెట్రో అనుమతులకు ఆదేశించాలని కోరారు.



దిల్లీ:

నీతి ఆయోగ్ భేటీలో ప్రధాని నరేంద్రమోదీతో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా మాట్లాడారు. హైదరాబాద్ మెట్రోకు త్వరగా అనుమతులు ఇవ్వాలని సీఎం విజ్ఞప్తి చేశారు. మెట్రోకు త్వరగా అనుమతి ఇచ్చేలా పట్టణాభివృద్ధిశాఖను ఆదేశించాలని కోరారు. ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తరభాగానికి, దక్షిణ భాగానికి ఒకేసారి ఆర్థిక, మంత్రివర్గ అనుమతులు ఇవ్వాలని కోరారు. ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగం భూసేకరణకు 50శాతం ఖర్చు రాష్ట్ర ప్రభుత్వం భరించేందుకు సిద్ధమని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆర్‌ఆర్‌ఆర్‌కు సమాంతరంగా గ్రీన్‌ఫీల్డ్ రైల్వే లైన్ నిర్మాణానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ సమీపంలో డ్రై పోర్టు ఏర్పాటు చేస్తామని, ఈ డ్రైపోర్టును మచిలీపట్నం పోర్టుకు అనుసంధానానికి గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు, గ్రీన్‌ఫీల్డ్ రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని ప్రధానిని కోరారు.



## దేశంలో కొత్త కొవిడ్ వేరియంట్లు.. వెల్లడించిన ఇన్సాకాగ్

కరోనా వైరస్ గురించి పూర్తిగా మర్చిపోతున్న తరుణంలో మరోసారి పంజా విసురుతోంది. తాజాగా దేశంలోని పలు రాష్ట్రాలు ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో వైరస్ కేసులు వెలుగు చూస్తున్నాయి. కొవిడ్ కొత్త వేరియంట్లు ఎన్‌బీ.1.8.1, ఎల్‌ఎఫ్.7లను భారత్‌లో గుర్తించినట్లు ఇండియన్ సార్స్-కోవ్-2 జీనోమిక్స్ కన్సార్టియం శనివారం వెల్లడించింది. ఎన్‌బీ.1.8.1 రకం కేసు ఏప్రిల్‌లో బయటపడగా.. ఎల్‌ఎఫ్.7 కు సంబంధించి నాలుగు కేసులు మేలో గుర్తించినట్లు తెలిపింది. అవి తమిళనాడు, గుజరాత్‌లో నమోదయ్యాయి.

2లో..

## కేఏ పాల్ సభకు హైకోర్టు అనుమతి



హైదరాబాద్:
ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ శనివారం సికింద్రాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో ప్రపంచ శాంతి ఉత్సవం నిర్వహించుకొనేందుకు హైకోర్టు షరతులతో కూడిన అనుమతి మంజూరు చేసింది. సభలో వెయ్యి మందికి మించి ప్రజలు పాల్గొనరాదని.. ప్రార్థనలు మినహా ఇతర ప్రేరేపిత ప్రసంగాలు చేయరాదని సభ నిర్వహిస్తున్న గ్లోబల్ పీస్ ఫెస్టివల్‌కు స్పష్టం చేసింది. సభ శాంతియుతంగా సాగేలా పోలీసులు చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది.ఏదైనా అనుకోని ఘటన జరిగితే దానికి సొసైటీనే బాధ్యత వహించాల్సి ఉంటుందని తేల్చిచెప్పింది. నిబంధనలు ఉల్లంఘించినా లేక దేశ ప్రయోజనాలకు, సమగ్రతకు విరుద్ధమైన నినాదాలు చేసినా పోలీసులు చర్యలు తీసుకోవచ్చని ఉన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. సభకు పోలీసులు అనుమతి నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ గోస్పెల్ సొసైటీ హైకోర్టులో దాఖలు చేసిన హౌస్‌మోషన్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన జగద్గిరిగుట్ట ఎస్సై



మేడ్చల్ మల్కాజ్ :
మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాలో లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు ఓ ఎస్సై. పెళ్లిళ్లకు బ్యాండ్ వాయించే బ్యాండ్ ట్రూప్ నుంచిలంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా ఏసీబీ అధికారులకు దొరికాడు. వివరాల్లోకి వెళితే..ఓ బ్యాండ్ ట్రూప్ నుంచి లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికిపోయాడు జగద్గిరిగుట్ట ఎస్సై శంకర్. బల్కంపేటకు చెందిన హరికమల్ బ్యాండ్ సిబ్బంది జగద్గగిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ శుభకార్యానికి హాజరై బ్యాండ్ వాయించారు.

## మా పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఉంది



మిగతాది 2లో

» పార్టీ అధినేతకు లేఖలు రాస్తే తప్పేమి కాదు
» అంతర్గత విషయాలు బయట మాట్లాడడం సరికాదు
» మా పార్టీలోనూ రేవంత్ కోవర్టులు ఉంటే ఉండొచ్చు
» కవిత లేఖపై మీడియా సమావేశంలో స్పందించిన కెటిఆర్

హైదరాబాద్,మే24:
పార్టీ అధినేతకు సూచనలు చేయాలనుకుంటే లేఖలు రాయవచ్చునని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. పార్టీ అధినేతకు లేఖలు రాస్తే తప్పేమి కాదని అన్నారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కవిత లేఖపై కెటిఆర్ స్పందించారు. అంతర్గతంగా మాట్లాడే అంశాలు బయట మాట్లాడటం సరికాదని, పార్టీలో అందరం కార్యకర్తలమే..ఇది అందరికీ వర్తిస్తుందని చెప్పారు. తమ పార్టీలో ప్రజాస్వామ్యం ఉందని, కోవర్టులు సమయం వచ్చినప్పుడు వారే బయటపడతారని పేర్కొన్నారు. అన్ని పార్టీల్లోనూ కోవర్టులు ఉంటారని, తమ పార్టీలోనూ సిఎం రేవంత్ రెడ్డి కోవర్టులు ఉంటే ఉండొచ్చునని అన్నారు.



## సిస్టర్ స్ట్రోక్‌తోనే కేటీఆర్ అలా మాట్లాడారు: మంత్రి సీతక్క

హైదరాబాద్:
కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు తాజాగా చేసిన వ్యాఖ్యలపై మంత్రి సీతక్క స్పందించారు. గోబెల్స్ ప్రచారంలో కేటీఆర్ ను మించిన వారే లేరని కౌంటర్ ఇచ్చారామె.శనివారం మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడుతూ.. "కవిత చెప్పిన దెయ్యం కేటీఆరే. సిస్టర్ స్ట్రోక్ తో కేటీఆర్ చిన్న మెదడు చిట్లింది. కాళేశ్వరంలో కమీషన్లు తిన్నప్పుడు లేని భయం.. కమిషన్ ముందు హాజరయ్యేటప్పుడు ఎందుకు?. అబద్ధాల పునాదులపై బీఆర్ఎస్ నడుస్తోంది.

02

## 'బీఆర్ఎస్ మూడు ముక్కలు కాబోతుంది'



ఢిల్లీ:
బీఆర్ఎస్ మూడు ముక్కలు కాబోతుందంటూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కవిత ఇచ్చిన ఝలక్‌తో కేటీఆర్‌కు మతి భ్రమించిందన్నారు. ఇంట్లో కంపటి తట్టుకోలేక కేటీఆర్ సతమతమవుతున్నారంటూ చెప్పుకొచ్చారు. కవిత ఎపిసోడ్ డైవర్ట్ చేసేందుకే తమపై ఆరోపణలు చేశారన్న మహేష్ గౌడ్.. పది సంవత్సరాల బీఆర్ఎస్ తప్పిదాలను కవిత ఎత్తి చూపిందన్నారు.బీఆర్ఎస్ తప్పిదాలన్ని ప్రజలకు అర్థమవుతున్నాయి. కాళేశ్వరం అవినీతిలో కేసీఆర్‌కు నోటీసులతో.. కేటీఆర్ భయపడుతున్నాడు. బీఆర్ఎస్‌కు, బీజేపీకి స్పష్టమైన అవగాహన ఉన్నట్లు కవిత వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. బీఆర్ఎస్ మూడు ముక్కలు కాబోతుంది కవిత, కేటీఆర్ మధ్య పోటీ తీవ్రం కావడంతో అదను కోసం హరీష్ రావు ఎదురుచూస్తున్నారు. దిక్కుతోచని స్థితిలో కేసీఆర్ ఫామ్ హౌస్‌కి పరిమితమయ్యారు" అంటూ మహేష్ గౌడ్ విమర్శలు గుప్పించారు."కేసీఆర్ చుట్టూ ఉన్న దెయ్యాలు ఎవరో ప్రజలకు తెలియాలి. పదేళ్ల అవినీతిలో పంపకాల్లో వచ్చిన తేడాతోనే.. కవిత జెండా ఎగరవేసినట్లు అర్థమవుతుంది. భవిష్యత్తు తెలంగాణ రాజకీయ ముఖచిత్రంలో బీఆర్ఎస్ ఉండదు" అంటూ మహేష్ గౌడ్ వ్యాఖ్యానించారు.

## కాళేశ్వరానికి పోటెత్తిన భక్తులు.. భారీగా ట్రాఫిక్ జాం.



2 లో

కాళేశ్వరం... సరస్వతీ పుష్కరా లకు జనం పోటెత్తుతున్నారు. మద్దులపల్లి -కాళేశ్వరం మధ్యలో 8 కిలో మీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది. గంటల తరబడి ట్రాఫిక్? జామ్ కావడంతో భక్తుల ఇబ్బందులు పడుతున్నారు. సరస్వతీ పుష్కరాలకు సోమవారం (మే 26) చివరి రోజు కావడంతో భక్తులు బారులు తీరుతున్నారు. పుష్కరాలు ముగింపు దశకు చేరు కోవడంతో భక్తుల రద్దీ మరింత పెరింది. కాళేశ్వరం పుష్కరానికి వెళ్లిన భక్తులు ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడంతో కొంతమంది ప్రయాణికులు కాలినడకన పుష్కర ఘాట్లకు చేరుకుంటున్నారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ఎలాంటి అంతరాయం లేకుండా ట్రాఫిక్‌ను పునరుద్ధరిస్తున్నారు. కాళేశ్వరానికి వచ్చిన భక్తులు ఇబ్బంది పడకుండా ప్రత్యేకంగా టెంట్లు ఏర్పాటు చేశారు.

## గోదావరి జలాలను ఎత్తుకుపోతుంటే చూస్తారా?

» బనకచర్లకు అనుమతితో తెలంగాణకు బిజెపి ద్రోహం
» దీనిపై వెంటనే కేంద్రాన్ని, ఎపిని నిలదీయాలి
» మాజీమంత్రి హరీష్ రావు డిమాండ్


హైదరాబాద్,మే24:
తెలంగాణ నీటి హక్కులను కాలరాస్తూ, గోదావరి జలాలను ఎత్తుకు పోయేందుకు ఏపీ ప్రభుత్వం కుట్రలు చేస్తుంటే, తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రులు ఏం చేస్తున్నట్లని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నిలదీశారు.



మిగతాది 2లో

# సంపాదకీయం

## శ్వేతసౌధంలో మళ్లీ 'పంచాయితీ'



అతిథుల్ని పిలిచి బహిరంగంగా వాగ్యుద్ధానికి దిగటం ఏ రకంగా దౌత్యనీతి అవుతుందో, దాన్ని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఎక్కడ నేర్చారో ఎవరికీ తెలియదు. కానీ ఆయన దాన్ని కొనసాగించదల్చుకున్నారని దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రాంఫోసాతో వైట్‌హౌస్‌లో తాజాగా సాగిన జగడం నిరూపిస్తోంది. మొన్న ఫిబ్రవరిలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ట్రంప్ ఇదే మాదిరి తగువు పెట్టుకున్నారు. ఉక్రెయిన్‌పై రష్యా సాగిస్తున్న దురాక్రమణ యుద్ధంలో తప్పంతా ఉక్రెయిన్‌దే అన్నట్టు తేల్చి, దాన్ని వెంటనే నిలిపేయాలని ఒత్తిడి తెచ్చారు.అడుగడుగునా అవమా నిస్తూ మాట్లాడారు. మళ్లీ మూణ్ణెల్లకు అదే వైట్‌హౌస్‌లో ట్రంప్ ఆ డ్రామాకే తెరతీశారు. నిజానికి ఇరు దేశాల అధినేతలు కలుసుకుని చర్చించినాక వారిద్దరూ కలిసి మాట్లాడే మీడియా సంయుక్త సమావేశం లాంఛనప్రాయమైనది. నాలుగు గోడలమధ్యా నిర్మొహమాటంగా మాట్లాడుకున్నా, వాదులాడుకున్నా... మీడియా సమావేశంలో పరస్పరం ప్రశంసించుకోవటాలు, రెండు దేశాల మధ్యా కుదిరిన ఒప్పందాల విశిష్టతను అతిగా చూపించుకోవటాలు జరిగిపోతాయి. ఇందువల్లరెండు దేశాల్లోనూ అధినేతలకు ప్రశంసలు దక్కుతాయి.కానీ ఇలాంటివి ట్రంప్‌కు పట్టవు. ప్రపంచానికి తాను మకుటంలేని మహారాజునని, ఎవరినైనా ఏమైనా అనగలనని అమెరికా శ్వేతజాతి ఓటరు మహాశయులకు ఆయన చెప్పదల్చుకున్నారు.అందుకే అతిథులుగా వచ్చిన అధినేతలను కెమెరాల ముందు ఇష్టానుసారం మాట్లాడటం అల వాటు చేసుకున్నారు. పోనీ ఆయన నిలదీస్తున్న అంశాలు గొప్పవేమీ కాదు. వాటిల్లో చాలామటుకు నకిలీవీ... నిరాధారమైనవీ. సామాజిక మాధ్యమాల్లో ఎవరెవరో పెట్టే తప్పుడు పోస్టింగులే వాటికి ఆధారం.ఉక్రెయిన్‌లో దేశాధినేతను మార్చి, ఆయన ద్వారా రష్యాను చీకాకుపెట్టి చివరకు అది రెచ్చిపోయి దాడిచేసే స్థితి కల్పించింది అమెరికాయే. అటు తర్వాత రష్యాను ప్రపంచంలో ఏకాకిని చేయటానికి ప్రయత్నించి, ఉక్రెయిన్‌కు పెద్దయెత్తున ఆయుధాలు అమ్ముకున్నది అమెరికాయే. నాటో దేశాలను సైతం ఈ రొంపిలోకి దించింది కూడా ఆ దేశమే. జో బైడెన్ హయాంలో ఇవన్నీ జరిగినట్టు తెలిసినా, ట్రంప్ ఏమీ తెలియనట్టు నటించారు. ఉక్రెయిన్‌నే వేలెత్తి చూపారు. ఇప్పుడు రాంఫోసాతో సైతం అదే తరహాలో వ్యవహారం నడిపారు.దక్షిణాఫ్రికాలో శ్వేతజాతీయుల ఊచకోత సాగుతున్నదనీ, వాటిల్లో చాలాభాగం బయటకు రావటం లేదనీ ట్రంప్ వాదించారు. ఒకప్పటి శ్వేతజాతి పాలనలో నల్లజాతీయులపై అఘాయిత్యాలు జరిగాయని ఒప్పుకుంటూనే ఇప్పుడు నల్లజాతి పాలనలో శ్వేతజాతీయుల్ని ఆ మాదిరేహింసిస్తున్నారని చెప్పుకొచ్చారు. మీ వద్ద ఆధారాలున్నాయా అని రాంఫోసా అడిగితే, లేవని అంగీ కరిస్తూనే ట్రంప్ ఒక వీడియో ప్రదర్శించారు. అందులో నల్లజాతి వామపక్ష నాయకుడు జూలియస్ మలేమా 'శ్వేతజాతి ఆఫ్రికన్లను హతమార్చండ'ంటూ నినాదాలిస్తున్న దృశ్యాలు కనబడ్డాయి. మొత్తం గంటసేపు జరిగిన ఈ మీడియా సమావేశంలో రాంఫోసా ఎక్కడా ఆవేశానికి పోకుండాఎంతో సంయమనంతో ట్రంప్‌కు జవాబిచ్చే ప్రయత్నం చేశారు.నిజానికి దక్షిణాఫ్రికాలో ఇప్పటికీ నాలుగింట మూడొంతుల వ్యవసాయ భూములు 8 శాతంకన్నా తక్కువ జనాభాగల శ్వేతజాతీయుల చేతుల్లో వున్నాయి. జనాభాలో 80 శాతంగా వున్న నల్లజాతీయులకు వ్యవసాయ భూముల్లో వాటా కేవలం 4 శాతం మాత్రమే. కానీ ట్రంప్ మాత్రం దక్షిణాఫ్రికా ప్రభుత్వం శ్వేతజాతీయుల భూముల్ని గుంజుకుని వాటిని నల్లజాతీయులకు పంచు తున్నదని ఆరోపించారు. శ్వేతజాతి దురహంకార పాలనలో నల్లజాతీయుల నుంచి అక్రమంగా చేజిక్కించుకున్న భూములు వెనక్కిప్పించాలని స్థానికులు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నా అక్కడి ప్రభుత్వం అంగీకరించటం లేదు.దానికి బదులు స్వచ్ఛందంగా అమ్మటానికి సిద్ధపడే శ్వేత జాతీయులకు పలు రాయితీలిస్తున్నది. శ్వేతజాతి రైతుల ఊచకోత సాగుతున్నదన్న ట్రంప్ వాదన కూడా పూర్తి అబద్ధం. నేరాల రేటు చూస్తే ప్రపంచంలోనే దక్షిణాఫ్రికా ముందుంది. అక్కడ సగటున రోజుకు 72 హత్యలు జరుగుతాయి. ఆరుకోట్ల జనాభాగల ఆ దేశంలో హతుల్లో అత్యధికులు నల్లజాతీయులు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం నిరుడు 26,232 మంది హత్యకు గురైతే అందులో కేవలం 8 మంది మాత్రమే శ్వేతజాతి రైతులు. వాస్తవాలు ఇవికాగా ట్రంప్ వైట్‌హౌస్ వేదికగా ఒక దేశాధినేతపై ప్రపంచమంతా చూస్తుండగా దబాయించటం ఎంత దారుణం!నిజానికి రెండు దేశాలూ చర్చించి పరిష్కరించుకోవాల్సినవి చాలావున్నాయి. శ్వేతజాతి రైతుల ఊచకోత ప్రచారాన్ని నమ్మటంతో బైడెన్ హయాంలోనే నిధులు ఆపేశారు. ట్రంప్ వచ్చాక 25 శాతం సుంకాల విధింపును ప్రకటించారు. ఆ దేశంలోని సహజ వనరులపై ట్రంప్ కన్నుపడింది. వీటిపై అర్థవంతమైన చర్చలు జరగకుండానే తప్పుడు ప్రచారంపై వాదులాట సాగింది. గాజాలో ఇజ్రాయెల్ సాగిస్తున్న ఊచ కోతపై ధైర్యంగా అంతర్జాతీయ న్యాయస్థానం తలుపుతట్టింది దక్షిణాఫ్రికాయే. రాంఫోసా అదృష్టం బాగుండి ట్రంప్‌కు ఆ సంగతి గుర్తురాలేదు. లేకుంటే మరింతగా విరుచుకుపడేవారు. వర్తమాన ప్రపంచంలో పలు దేశాధినేతలు తప్పుడు సమాచారాన్నీ, వదంతుల్నీ ప్రచారంలో పెట్టి అధికారంలోకొచ్చినవారే. ఈ ఎత్తుగడలే మరోసారి అందలం ఎక్కిస్తాయని... రాజ్యాంగాన్ని సవరించి మూడోసారి అధ్యక్షుడు కావాలని కలగంటున్న ట్రంప్ విశ్వసిస్తున్నారు. ఇలాంటపుడు అమెరికాలో అడుగుపెట్టడానికీ, ట్రంప్‌తో చీవాట్లు తినటానికీ ఏ దేశాధినేతయినా ధైర్యం చేయగలరా?

## మా పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఉంది

మొదటిపేజీ తరువాయి
లోక్‌సభ ఎన్నికలకు ముందు పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సమీక్ష సమావేశాలు పెట్టాం.. అసెంబ్లీలో ఓడిపోయాం.. ఎలా ముందుకు పోవాలని 17 రోజుల పాటు– వేల మంది కార్యకర్తలతో చర్చించాం. ఆ ప్రాసెస్‌లో చాలా మంది డైరెక్ట్‌గా మైక్‌లో మాట్లాడిన వారు ఉన్నారు. కొంత మంది చిట్టీల మీద రాసిచ్చిన వారు ఉన్నారు. కొంత మంది కేసీఆర్‌కు ఉత్తరం అందించండి అని ఉత్తరాలు ఇచ్చిన వారు ఉన్నారు. మా పార్టీలో ప్రజాస్వామిక స్ఫూర్తి ఉంది. మా పార్టీ అధ్యక్షుడికి ఏవైనా సూచనలు చేయాలను కుంటే ఉత్తరాలు రాయొచ్చు. మా పార్టీలో డెమోక్రసీ ఉంది కాబట్టి.. సూచనలు సలహాలు చేస్తూ అధ్యక్షుడికి లిఖిత పూర్వకంగా, ఓరల్‌గా ఇవ్వొచ్చు అని కేటీఆర్ పేర్కొన్నారు. పార్టీలో ఏ హోదాలో ఉన్నా.. అంతర్గతంగా మాట్లాడాల్సిన విషయాలు అంతర్గతంగా మాట్లాడితేనే బాగుంటది. అధ్యక్షుడిని కలిసే అవకాశం ఉంది.. ఆఫీస్ బేరర్స్ ఉన్నారు.. వారిని కూడా కలిసే అవకాశం ఉంది. కాబట్టి కొన్ని విషయాలు అంతర్గతంగానే మాట్లాడితే బాగుంటు–ంది.. ఇది అందరికీ వర్తిస్తుంది. అన్ని పార్టీల్లో కోవర్టులు ఉంటారు.. అందులో రేవంత్ రెడ్డి కోవర్టులు ఉంటే ఉండొచ్చు అని కేటీఆర్ అన్నారు. తెలంగాణకు పట్టిన శని కాంగ్రెస్ అని,దెయ్యం రేవంత్ రెడ్డి అని విమర్శించారు. హైకమాండ్ కు డబ్బులిస్తూ రేవంత్ పదవి కాపాడుకుంటున్నారని, ఇడి ఛార్జ్‌షీట్‌లో పేరున్న రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. నాడు ఓటుకు నోటు స్కామ్.. ఇది సీటుకు రూటు– స్కామ్ అని కెటిఆర్ ఎద్దేవా చేశారు. నైతికత ఉంటే ముఖ్యమంత్రి స్వచ్ఛందం గా తప్పుకోవాలని, ఆయన తప్పుకోకుంటే అధిష్టానం తొలగించాలని సూచించారు. రేవంత్ రెడ్డి మాటల మనిషి కాదని, మూటల మనిషి అని చురకలంటించారు. రేవంత్ దిల్లీ వెళ్లి చీకట్లో బిజెపి నేతల కాళ్లు పట్టుకుంటున్నారని, అమిత్ షాను రాత్రి కలిసిన రేవంత్ బయటికొచ్చిగట్టిగా మాట్లాడారని మండిపడ్డారు. నిందలు, దందాలు, చందాలు ఇదే రేవంత్ పని అని విమర్శలు గుప్పించారు. బిఆర్‌ఎస్ పై నిందలు, కాంట్రాక్టర్లతో దందాలు, ఢిల్లీకి చందాలు అని కెటిఆర్ దుయ్యబట్టారు. బిజెపి ఎంపిల భూదందాలకు సిఎం వత్తాసు పలుకుతున్నారని, బిజెపి నేతలు రాష్ట్ర కాంగ్రెస్ నేతలను ఎందుకు కాపాడుతున్నారని ప్రశ్నించారు. అందుకే నేషనల్ హెరాల్డ్ కేసుపై నేతలు మాట్లాడట్లేదని అన్నారు. చిత్తశుద్ధి ఉంటే అన్ని అంశాలపై కేంద్రం చర్య తీసుకోవాలని కెటిఆర్ కోరారు. కేంద్రం స్పందన కోసం నెలరోజులు ఎదురు చూస్తామని, నెల తర్వాత పార్టీలో చర్చించి కార్యాచరణ ప్రకటిస్తాం అని కెటిఆర్ స్పష్టం చేశారు. తెలంగాణకు పట్టిన శని కాంగ్రెస్.. దయ్యం రేవంత్ రెడ్డి.. ఈ దయ్యాన్ని, శనిని ఎలా వదిలించాలనేది మా టార్గెట్అన్నారు.

## గోదావరి జలాలను ఎత్తుకుపోతుంటే చూస్తారా?

మొదటిపేజీ తరువాయి
ఎలాంటి అనుమతులు లేకుండా రూ. 80 వేల కోట్లతో నిర్మించతలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్రం 50శాతం నిధులు, మిగతా 50శాతం ఎఫ్‌ఆర్‌బీఎం పరిధి మించి రుణ సమీకరణకు ఏపీకి అనుమతించడం అన్యాయం, అనైతికం అని హరీశ్‌రావు మండిపడ్డారు. విభజన చట్టం ప్రకారం, కృష్ణా లేదా గోదావరి నదులపై కొత్త ప్రాజెక్టులు నిర్మించాలనుకుంటే రివర్ మేనేజ్మెంట్ బోర్డుల అనుమతి అవసరం. కానీ అందుకు విరుద్ధంగా, రాష్ట్ర పునర్విభజన చట్టంలోని నిబంధనలను ఏపీ ప్రభుత్వం తుంగలో తొక్కుతుంటే అడ్డుకోవాల్సిన కేంద్రం, నిధులిచ్చి సహకరించడం దుర్మార్గం అన్నారు. ఇది తెలంగాణ రాష్ట్రానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న తీవ్ర అన్యాయం అన్నారు. ఇద్దరు కేంద్ర మంత్రులు, 8 మంది బిజేపీ ఎంపీలు, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు ఉండి ఏం లాభమని హరీశ్‌రావు ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రుణం తీసుకుంటే, ఎఫ్‌ఆర్‌బీఎం కింద రికవరీ పెట్టారు, కానీ బనకచర్ల విషయంలో మాత్రం అందుకు భిన్నంగా 50శాతం ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితి మించి రుణం తీసుకునేందుకు పర్మిషన్ ఇచ్చారు. తెలంగాణపై సవతి తల్లి ప్రేమ, ఆంధ్రప్రదేశ్‌పై వరాల జల్లులు కురిపిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసే ధైర్యం కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదు. నాటి సమైక్య పాలకులు పోతిరెడ్డిపాడుతో కృష్ణా జలాల అక్రమ తరలింపుకు ప్రణాళిక వేస్తే, నేటి కాంగ్రెస్ నాయకుల సమక్షంలోనే బనకచర్ల ద్వారా గోదావరి జలాల దోపిడికి మార్గం సుగమం చేస్తున్నారు. కేంద్రాన్ని నిలదీయలేరు, ఏపీతో పోరాటం చేయలేరు. చేతగాని ప్రభుత్వం వల్ల తెలంగాణ నష్టపోయే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ అలసత్వం రాష్ట్ర ప్రయోజనాలకు గొడ్డలి పెట్టుగా మారాయి. నీతి అయోగ్ సమావేశానికి హాజరవుతున్న ముఖ్యమంత్రి ఏపీ అక్రమ ప్రాజెక్టుపై సమావేశంలో చర్చించి, ఏపీ జల దోపిడిని అడ్డుకోవాలని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## సిస్టర్ స్ట్రోక్‌తోనే కేటీఆర్ అలా మాట్లాడారు: మంత్రి సీతక్క

మొదటిపేజీ తరువాయి
రాహుల్ గాంధీ గురించి మాట్లాడే స్థాయి కేటీఆర్‌కు లేదు" అని అన్నారామె. అటవీ శాఖ కఠిన నిబంధనల వల్ల ఉమ్మడి అదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో అటవీ సమీప గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రి సీతక్క అన్నారు. "ప్రజల తరఫున వారి సమస్యలను ఎమ్మెల్యేలు మా దృష్టికి తీసుకొస్తున్నారు. అందుకే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారాలు చూపించాలనే ఉద్దేశంతో అటవీ శాఖ, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ, రోడ్లు భవనాల శాఖ, ఐటీడీఏ శాఖలతో ఈరోజు సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేశాం. ఈ భేటీలో క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను విస్తృతంగా చర్చించి ఓ మార్గం చూపిస్తాం. అటవీ ప్రాంతాల్లోనీ ప్రజల అభివృద్ధికి అటవీశాఖ అధికారులు మానవీయ కోణంలో సహకరించాలి. కనీస సౌకర్యాలు కల్పించాలి" అని అన్నారామె.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన జగద్గిరిగుట్ట ఎస్సై

మొదటిపేజీ తరువాయి
అయితే శబ్దకాలుష్యానికి పాల్పడుతున్నారంటూ ఎస్సై శంకర్ బ్యాండ్ కు సంబంధించిన వాహనాన్ని సీజ్ చేశాడు. జగద్గిరి గుట్టకు చెందిన మధ్యవర్తి నాగేందర్ ను మధ్యవర్తిగా పెట్టుకొని బ్యాండ్ ట్యాప్ నుంచి 15వేలు లంచం డిమాండ్ చేశాడు. ఎస్సై వేధింపులు భరించలేక బాధితుడు ఏసీబీకి ఫిర్యాదు చేశారు. శనివారం (మే24) ఉదయం బాధితుడు రూ. 15వేలు మధ్యవర్తి నాగేందర్ కు అందజేశాడు. నాగేందర్ ఆ మొత్తాన్ని ఎస్సై శంకర్?కు అందజేస్తుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. అవినీతికి పాల్పడిన ఎస్సై శంకర్, అతనికి సహకరించిన నాగేందర్ పై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## కాళేశ్వరానికి పోటెత్తిన భక్తులు.. భారీగా ట్రాఫిక్ జాం.

మొదటిపేజీ తరువాయి
ఆదివారం ( మే 25) .. సోమవారం పుష్కరాలకు చివరి రోజు కావడంతో భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. భక్తులకు తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చలివేంద్రాలు ఏర్పాటుచేసి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అలాగే భక్తులకు ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లను కూడా పంపిణీ చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ స్వయంగా కాళేశ్వరంలోనే విడిది చేసి వసతులు, ఏర్పాట్లను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ చర్యలు చేపడుతున్నారు. సరస్వతీ పుష్కరాలకు తరలివచ్చే భక్తులకు కాళేశ్వర క్షేత్రం మొత్తాన్ని ఏరియల్ వ్యూ ద్వారా వీక్షించడం కోసం అధికారులు హెలీకాప్టర్ జాయ్ రైడ్‌ను యాత్రాదాం.ఓఆర్‌జి ద్వారా అందుబాటులోకి తెచ్చారు.దూర ప్రాంతాల నుంచి భక్తుల ఎలాంటి ఇబ్బందులు పడకుండా పుష్కర ఘాట్ లకు దగ్గర్లోనే టెంట్లు ఏర్పాటు చేశారు. ఒంటరిగా వచ్చే భక్తుల కోసం ప్రత్యేకంగా డార్మెటరీ సదుపాయం కల్పించారు. అధునాతన వసతులతో ఏర్పాటు చేసిన వసతి గృహాలపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సోమవారంతో సరస్వతి పుష్కరాలు ముగియనున్నాయి.వీకెండ్ కావడం.. పుష్కరాల చివరి రోజు కావడంతో భక్తుల తాకిడి పెరుగుతోంది. త్రివేణీ సంగమ పరిసరాలు ఇప్పటికే జనసంద్రంగా మారాయి. దీంతో ఘాట్ పరిసరాల్లో అదనంగా వాహనపార్కింగ్ స్థలాలను అధికారులు సిద్ధం చేశారు.

## దేశంలో కొత్త కొవిడ్ వేరియంట్లు.. వెల్లడించిన ఇన్సాకాగ్

మొదటిపేజీ తరువాయి
దిల్లీ, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక సహా పలు రాష్ట్రాల్లో కొత్త కేసులను గుర్తిస్తున్నారు. మూడేళ్లలో తొలిసారి దిల్లీలో 23 మందికి వైరస్ సోకిందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. దాంతో అన్ని ప్రభుత్వాలు ఆసుపత్రులను అప్రమత్తం చేశాయి. కేసులు నమోదవుతున్నప్పటికీ.. తీవ్రత తక్కువేనని ఇటీవల కేంద్ర ఆరోగ్యశాఖ పేర్కొంది. అయినా అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను పర్యవేక్షిస్తున్నామని తెలిపింది .ఇటీవల కాలంలో ఆసియా దేశాలు మరీ ముఖ్యంగా హాంకాంగ్, సింగపూర్, థాయ్‌లాండ్‌తో పాటు చైనాలోనూ కొవిడ్–19 వ్యాప్తి విపరీతంగా ఉంది. వారానికి వేల సంఖ్యలో కేసులు వెలుగు చూస్తున్నాయి. వైరస్ వ్యాప్తికి జేఎన్.1 వేరియంట్, దాని ఉపరకాలే కారణంగా అధికారులు చెబుతున్నారు. జేఎన్.1 ఉపరకాలైన ఎల్‌ఎఫ్.7, ఎన్‌బీ.1.8 వేరియంట్ల వ్యాప్తి అధికంగా ఉందని ఇటీవల సింగపూర్ ఆరోగ్యశాఖ తెలిపింది. జ్వరం, ముక్కు కారడం, గొంతునొప్పి, తలనొప్పి, నీరసం వంటి స్వల్ప లక్షణాలు కనిపిస్తున్నాయని, బాధితులు నాలుగు రోజుల్లో కోలుకుంటున్నారని వైద్య నిపుణులు వెల్లడించారు.దిల్లీలో కేసులతో అక్కడి భాజపా ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆసుపత్రుల్లో పడకలు, ఆక్సిజన్ సిలిండర్లు, టెస్టింగ్ కిట్స్, వ్యాక్సిన్ల లభ్యత సరిచూసుకోవాలని సూచించింది. వివిధ రకాల శ్వాసకోశ వైరస్ కేసుల వివరాలను పొందుపర్చాలని ఆదేశించింది. వైరస్ వేరియంట్లలో కలిగే మార్పులు ప్రస్తుత వ్యాప్తికి సంబంధం ఉందని, దీంతోపాటు ఇమ్యూనిటీ తగ్గడం కూడా మరో కారణంగా పేర్కొంది. అయితే, ప్రస్తుతం ఆసియా దేశాల్లో కొవిడ్ వ్యాప్తికి కారణంగా భావిస్తున్న జేఎన్.1 రకం 'వేరియంట్ ఆఫ్ ఇంట్రెస్ట్' మాత్రమేనని, ఆందోళన కలిగించే రకం కాదని ప్రపంచ ఆరోగ్యసంస్థ ఇదివరకే స్పష్టం చేసింది.

## కేరళను తాకిన రుతుపవనాలు

### 16 ఏళ్ల తరవాత ముందే వచ్చేసిన నైరుతి

### రెండురోజుల్లో ఎపిలోకి ప్రవేశించే అవకాశం


నైరుతి రుతుపవనాలు శనివారం కేరళను తాకాయి. దాదాపు ఎనిమిది రోజులు ముందుగానే కేరళలోకి రుతుపవనాలు ప్రవేశించినట్లు భారత వాతావరణ శాఖ శనివారం తెలిపింది. 2009 తర్వాత రుతుపవనాలు అంచనాల కంటే ముందుగా రావడం ఇదే మొదటిసారి. చివరిసారిగా 2009, 2001 సంవత్సరాల్లో ఇంత త్వరగా రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయి. అప్పుడు మే 23న రాష్ట్రాన్ని రుతుపవనాలు తాకాయి. ఇప్పుడు 16 ఏళ్ల తర్వాత మళ్లీ ఇంత తొందరగా రాష్ట్రంలోకి రుతుపవనాలు ప్రవేశించడం ఇదే తొలిసారి. ఈ ఏడాది ముందుగానే రుతుపవనాలు వస్తాయి ఐఎండి ఇప్పటికే తెలిపింది. ఈ క్రమంలో శనివరాం ఉదయం నైరుతి రుతుపవనాలు కేరళను తాకాయని కేంద్ర వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో కేరళలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక మరో రెండు రోజుల్లో రుతుపవనాలు విస్తరిస్తాయి. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించనున్నాయి. 2009లో మే 23న రుతుపవనాలు ప్రవేశించాయి. మళ్లీ ఇన్నాళ్లకు త్వరగా రుతుపవనాలు వచ్చాయి. సాధారణ తేదీ కంటే 8 రోజులు ముందే రుతుపవనాలు వచ్చినట్లు– ఐఎండీ పేర్కొంది. వాస్తవంగా రోహిణి కార్తె సమయంలో ఎండలు మండిపోతుంటాయి. అలాంటిది ఈ ఏడాది ఆ పరిస్థితులు తలెత్తలేదు. ఇక రోహిణి కార్తె మే 25 ఆదివారం రానుంది. ఇది జూన్ 8 వరకు ఉంటుంది. రాహిణి కార్తె సమయంలో ఎండలు భగభగ మండిపోతాయి. తీవ్ర ఉష్ణోగ్రతతో బండరాళ్లు కూడా పగిలిపోతాయంటారు. అలాంటిది ఈ ఏడాది ఆ పరిస్థితులు కనిపించకపోవడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తొలిసారిగా 1918 మే 11న రుతుపవనాలు ప్రవేశించిన రికార్డ్ ఉంది. అలాగే రుతుపవనాలు ఆలస్యంగా వచ్చిన రికార్డు ఉంది. 1972లో జూన్ 18న రుతుపవనాలు ప్రారంభమయ్యాయి. గత 25 సంవత్సరాల్లో అత్యంత ఆలస్యంగా రుతుపవనాలు 2016లో వచ్చాయి. జూన్ 9న రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించాయి. ఇదిలా ఉంటే రుతుపవనాల రాకతో మే 29 వరకు కేరళ, తీరప్రాంత కర్ణాటకలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. గంటకు 40–50 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పింది. తమిళనాడు, తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్‌లలో కూడా రాబోయే ఐదు రోజుల్లో అక్కడక్కడ వర్షాలు మరియు ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

## జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్

జార్ఖండ్‌లోని లటేహర్ జిల్లాలో శనివారం తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. శనివారం తెల్లవారుజామున భద్రతా బలగాలు మావోయిస్టుల కోసం గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ సందర్భంగా మావోయిస్టులకు, భద్రతా బలగాలకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. మృతి చెందినవారు మావోయిస్టు పార్టీ చీలిక వర్గమైన జార్ఖండ్ జన ముక్తి పరిషత్ చీఫ్ పప్పు లోహరా, ప్రభాత్ గంఝూగా గుర్తించారు. పప్పుపై రూ. 10 లక్షలు, ప్రభాత్‌పై రూ. 5 లక్షల చొప్పున రివార్డు ఉన్నదని పోలీసులు తెలిపారు. అయితే ఈ కాల్పుల్లో మరో వ్యక్తికి గాయలవ్వగా చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో మరో సైనికుడికి కూడా బుల్లెట్ గాయం అయింది. అతన్ని చికిత్స కోసం రాంచీలోని ఆసుపత్రికి తరలించారు. కాగా, ఈ ఆపరేషన్ మొత్తం జార్ఖండ్ డిజిపి అనురాగ్ గుప్తా మార్గదర్శకత్వంలో జరిగింది.

# గ్రామ పాలన అధికారుల రాత పరీక్షకు ఏర్పాట్లు పూర్తి





## - వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ వెల్లడి

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 24 :**
గ్రామ పాలన అధికారుల రాత పరీక్షను ప్రశాంత వాతావరణంలో, పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. ఆదివారం ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 1.30 వరకు కొనసాగనున్న రాత పరీక్షకు జిల్లాలో 331 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని అన్నారు. గ్రామ పాలన అధికారుల రాత పరీక్ష నిర్వహణ ఏర్పాట్ల విషయమై శనివారం హైదరాబాద్ నుండి సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జీ.పీ.ఓ పరీక్ష నిర్వహణ కోసం జిల్లాలో చేపట్టిన ఏర్పాట్ల గురించి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు కమిషనర్ దృష్టికి తెచ్చారు. 331 మంది అభ్యర్థులు హాజరు కానున్న నేపథ్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఒక్కో గదిలో 32 మంది అభ్యర్థుల చొప్పున మొత్తం 11 గదులలో పరీక్ష నిర్వహించేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టామని అన్నారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, తగిన పోలీసు బందోబస్తుకు ఆదేశించామన్నారు. అదేవిధంగా ఏఎన్ఎం, ఆశా వర్కర్ ఉండేలా చర్యలు తీసుకున్నామని, పరీక్ష సమయానికి అనుగుణంగా ప్రత్యేక బస్సులు నడిపేలా ఆర్టీసీ అధికారులకు సూచనలు చేశామన్నారు. నియమ నిబంధనలను తు.చ తప్పక పాటిస్తూ, ప్రశ్న పత్రాల బండిల్స్ తెరిచేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వివరించారు. పరీక్ష సామాగ్రిని సకాలంలో కేంద్రానికి చేరవేస్తూ, పరీక్ష ముగిసిన మీదట సీల్ చేసిన ఆన్సర్ షీట్ బండిళ్లను మూల్యాంకన కేంద్రానికి పంపించేలా తగిన ఏర్పాట్లు చేశామని అన్నారు. పరీక్షా కేంద్రంలో తాగునీటి వసతి, సరిపడా ఫర్నిచర్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కు అవకాశం లేకుండా ఇన్విజిలేటర్ లతో పాటు ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ లను నియమించామని అన్నారు. నిర్ణీత సమయానికి ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, ఆలస్యంగా వచ్చే వారిని లోనికి అనుమతించబోమని అభ్యర్థులకు ఇప్పటికే సూచించామని తెలిపారు.ఈ సందర్భంగా సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ, ఎలాంటి లోటుపాట్లకు, గందరగోళానికి తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో సజావుగా రాత పరీక్ష నిర్వహించాలని సూచించారు. దివ్యాంగ అభ్యర్థులు పరీక్ష రాసేందుకు సహకరించే స్క్రైబ్ లు పదవ తరగతి లోపు విద్యార్హత కలిగి ఉండాలని సూచించారు.వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, అదనపు డీసీపీ బస్వారెడ్డి, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, జీ.జీ కళాశాల ప్రిన్సిపాల్ రామ్ మోహన్, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, తహసిల్దార్ బాలరాజు, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,

## ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పుట్టినరోజు వేడుకలు





**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) 24 :**
ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పుట్టినరోజు వేడుకలు శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కేశ వేణు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ నగరంలో పలు సేవా సంస్థలలో సేవక్రమాలు, ఆలయా లలో ప్రత్యేక పూజలు నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉర్దూ అకా డమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ మహేష్ కుమార్ గౌడ్ కు పుట్టినరోజు కానుకగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో, కార్పొరే షన్ ఎన్నికల్లో విజయం సాధించి ఆయనకు బహుమతిగా ఇవ్వాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూనే పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి మహేష్ కుమార్ గౌడ్ చేస్తున్న కృషిని విజయవంతం చేస్తూ పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత మన పైన ఉంది అని తెలిపారు. నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కేశ వేణు మాట్లాడుతూ మహేష్ కుమార్ గౌడ్ బీసీ నాయకుడిగా ఎంతో ఎత్తుకు ఎదిగి అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కొరకు కృషి చేస్తూనే అన్ని వర్గాలను సమానంగా చూస్తున్న నాయకుడు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ శేఖర్ గౌడ్ ,జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతా రెడ్డి రాజారెడ్డి, రాష్ట్ర ఎన్ఎస్యుఐ ప్రధాన కార్యదర్శి వేణు రాజ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, పిసిసి ప్రచార కమిటీ మెంబర్ జావిద్ అక్రమ్, పిసిసి మాజీ కార్యదర్శి రాంభూపాల్,జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు దయాకర్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈసా, పార్లమెంట్ మా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, జిల్లా సేవల అధ్యక్షులు సంతోష్, జిల్లా ఓబీసీ అధ్యక్షులు నరేందర్ గౌడ్, మహిళా కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపాలన అధికారుల పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్






**మహబూబాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 24 :**
ఈ నెల 25న ఆదివారం జరగబోయే గ్రామ పాలన అధికారుల రాత పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ మహబూబాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగే జి.పి.ఓ పరిక్ష ఏర్పాట్లను రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మ చారీ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షా కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీ గా ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రం దగ్గర లోని నోటీస్ బోర్డులో సీటింగ్ అమరికను పరిశీలించారు. ఈ సీటింగ్ అమరిక, తరగతి గదిలోని సీటింగ్ ఒకేలా ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కంప్యూటర్ గదిని పరిశీలించారు. ఎలక్ట్రిసిటీ, త్రాగునీరు, తదితర మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నా రు. నిర్వహణ పై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఎక్కడ కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఆదేశించా రు. ఎలాంటి తప్పిదాలకు అవకాశం ఇవ్వకుండా చూడాలన్నారు. పక్కా గా ప్రశాంత వాతావరణంలో పరీక్ష లు జరిపించాలన్నారు. ఈ పరిశీ లనలో కలెక్టర్ వెంట డి.ఈ.ఓ డాక్టర్ ఏ.రవీందర్ రెడ్డి, స్థానిక ఎం.ఆర్.ఓ చంద్ర రాజేశ్వర్, పట్టణ సి.ఐ పి.దేవేందర్, సి.సెక్షన్ సూపరింటెండెంట్ వినోద్, ఈ.డి. యం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## భ్రూణ హత్యలు నివారించాలి

● జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్

మహబూబాబాద్, జిల్లా కలెక్టరేట్ లోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డిస్ట్రిక్ట్ లెవెల్ కోఆర్డినేషన్ కమిటీ మీటింగ్, మెడికల్ టర్మినేషన్ ప్రెగ్నెన్సీ, పి. సి. పి.ఎన్.డి.టి ఆక్ట్ ల పై జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ జిల్లాలో ఫిమేల్ లింగ నిష్పత్తి తక్కువగా ఉందని, అబార్షన్స్ రేట్ ఎక్కువగా ఉందని, ఎక్కడైతే ఫిమేల్ లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న మండలాలలో ప్రజల్లో అవగాహన కల్పిస్తామని, ఆరోగ్య సిబ్బంది ఎక్కడైనా ఏ హాస్పిటల్లో నైనా అబార్షన్స్ జరిగితే చెప్పాలని, ఎంటిపి ఆక్ట్ ప్రకారం వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ మెంబర్లు డాక్టర్ జగదీశ్వర్ పీడియాట్రిషన్, నగేష్, గవర్నమెంట్ ప్లీడర్, డాక్టర్.మీనాక్షి గైనకాలజిస్ట్, సి డబ్ల్యూ సి చైర్ పర్సన్ డాక్టర్ నాగవని , ఐసిడిఎస్ సూపర్వైజర్ వాహిని, కౌన్సిలర్ రమేష్, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ వెంకటేష్, ఆరోగ్య విద్యా బోధకులు కేవీ రాజు, హెచ్ ఈ ఓ లోక్య, సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, అరుణ్, మనోహర్ ఎల్. డి కంప్యూటర్స్, సిసి అనిల్ కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

# భ్రూణ హత్యలు నివారించాలి

## - జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్

**మహబూబాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 24 :**



శనివారం జిల్లా కలెక్టరేట్ లోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డిస్ట్రిక్ట్ లెవెల్ కోఆర్డినేషన్ కమిటీ మీటింగ్, మెడికల్ టర్మినేషన్ ప్రెగ్నెన్సీ, పి. సి. పి.ఎన్.డి.టి ఆక్ట్ ల పై జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ జిల్లాలో ఫిమేల్ లింగ నిష్పత్తి తక్కువగా ఉందని, అబార్షన్స్ రేట్ ఎక్కువగా ఉందని, ఎక్కడైతే ఫిమేల్ లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న మండలా లలో ప్రజల్లో అవగాహన కల్పిస్తా మని, ఆరోగ్య సిబ్బంది ఎక్కడైనా ఏ హాస్పిటల్లో నైనా అబార్షన్స్ జరిగితే చెప్పాలని, ఎంటిపి ఆక్ట్ ప్రకారం వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ మెంబర్లు డాక్టర్ జగదీశ్వర్ పీడియాట్రిషన్, నగేష్, గవర్నమెంట్ ప్లీడర్, డాక్టర్.మీనాక్షి గైనకాలజిస్ట్, సి డబ్ల్యూ సి చైర్ పర్సన్ డాక్టర్ నాగవని , ఐసిడిఎస్ సూపర్వైజర్ వాహిని, కౌన్సిలర్ రమేష్, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ వెంకటేష్, ఆరోగ్య విద్యా బోధకులు కేవీ రాజు, హెచ్ ఈ ఓ లోక్య, సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, అరుణ్, మనోహర్ ఎల్. డి కంప్యూటర్స్, సిసి అనిల్ కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రథసారథి

## బొమ్మ మహేష్ కుమార్ జన్మదిన వేడుకలు



## - జన్మదినం సందర్భంగా నిరుపేదలకు నిత్యవసర వస్తువులు పంపిణీ

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 24 :**
కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రథసారథి బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకొని నిజామాబాద్ నగరంలోని అభయహస్తం కాలనీలో మల్యాల గోవర్ధన్ ఆధ్వర్యంలో కాలనీ ప్రజలకు 12 రకాల నిత్యవసర వస్తువులను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రతినిధిగా క్రమశిక్షణ కలిగిన కార్యకర్త స్థాయి నుండి కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర రథసారధిగా ఎదిగిన బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలకు స్ఫూర్తి దాయకం అన్నారు, ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని అభయ హస్తం కాలనీలో 50 నిరుపేద కుటుంబాలకు సుమారు 1000 రూపాయలు విలువ గలిగిన 12 రకాల నిత్యవసర వస్తువులు, కూరగాయలు, పంపిణీ చేయడం జరిగింది అన్నారు, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నిరుపేద ప్రజలకు సన్నబియ్యం పంపిణీ చేస్తుందని, రాబోయే కాలంలో రేషన్ షాపు ద్వారా నిత్యవసర వస్తువులను పంపిణీ చేయాలని కోరుతూ ఈ విధమైన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అభయహస్తం కాలనీ ప్రజలు నర్సింగ్, నాగిరెడ్డి, జమీర్, స్వరూప, రాధిక, సంతోష్, రమాదేవి, స్వర్ణ, నసీమ, అంజు తదితరులు పాల్గొన్నారు.

# మూడు నెలల రేషన్ కోటా ఒకేసారి పంపిణీ

## - కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 24 :**



ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా వచ్చే మూడు మాసాలకు సంబంధించిన రేషన్ కోటాను ఒకేసారి పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన బియ్యం కోటాను రేషన్ దుకాణాల ద్వారా రేషన్ కార్డులు కలిగిన వారు ఒకేసారి పొందవచ్చని అన్నారు. ఈ మేరకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, చౌక ధరల దుకాణ డీలర్లు మూడు మసాల కోటాను దిగుమతి చేసుకుని వినియోగదారులకు సకాలంలో బియ్యం కోటా పంపిణీ చేయాలని సూచించారు. జూన్ 01 నుండి 30వ తేదీ లోపు పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు. బియ్యం పంపిణీలో అవకతవకలు, అలసత్వానికి తావిస్తే, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. వానాకాలం సీజన్‌లో సంభవించే వర్షాలు, వరదలు, నిల్వ సమస్యలు తదితర ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా రేషన్ దుకాణాలకు సకాలంలో బియ్యం నిల్వలు చేరుకునేలా, కార్డు హోల్డర్లకు వారి కోటా మేరకు ఏకకాలంలో మూడు నెలల పంపిణీ జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ షాపులకు సరుకులు సక్రమంగా తరలించేలా, బియ్యం నిల్వలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

# గ్రామపాలన అధికారుల పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన

● **జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**



మహబూబాబాద్, జిల్లా ఈ నెల 25 ఆదివారం జరగబోయే గ్రామ పాలన అధికారుల రాత పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ మహబూబాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగే జి.పి.ఓ పరిక్ష ఏర్పాట్లను రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మ చారీ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షా కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రం దగ్గర లోని నోటీస్ బోర్డులో సీటింగ్ అమరికను పరిశీలించారు. ఈ సీటింగ్ అమరిక, తరగతి గదిలోని సీటింగ్ ఒకేలా ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కంప్యూటర్ గదిని పరిశీలించారు. ఎలక్ట్రిసిటీ, త్రాగునీరు, తదితర మౌళిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు. నిర్వహణ పై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఎక్కడ కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎలాంటి తప్పిదాలకు అవకాశం ఇవ్వకుండా చూడాలన్నారు. పక్కాగా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిపించాలన్నారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట డి.ఈ.ఓ డాక్టర్ ఏ.రవీందర్ రెడ్డి, స్థానిక ఎం.ఆర్.ఓ చంద్ర రాజేశ్వర్, పట్టణ సి.ఐ పి.దేవేందర్, సి.సెక్షన్ సూపరింటెండెంట్ వినోద్, ఈ.డి.యం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# సీతారాం నగర్, బలరాం నగర్ లో దాదాపు 38 లక్షల రూపాయల వ్యయంతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన మల్కాజ్గిరి కార్పొరేటర్ శ్రవణ్



**జనసముద్రం న్యూస్ ,మే 24**

ఈ రోజు మల్కాజ్గిరి డివిజన్ సీతారాంనగర్, బలరాం నగర్ లలో దాదాపు 38 లక్షల రూపాయల వ్యయంతో సీసీ రోడ్డు పనులను మల్కాజ్గిరి కార్పొరేటర్ శ్రవణ్ జి.హెచ్.ఎం.సి అధికారులు మరియు కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు. గతం లో రోడ్డు పై పొంగి పొర్లు తున్న మురుగు నీటి నివారణకు, వాటర్ వర్క్స్ ద్వారా ఇదే స్థలంలో భూగర్భ డ్రైనేజీ వెయ్యడం జరిగింది. ఇప్పుడు పూర్తి స్థాయిలో మురుగు నీరు బైటకు రావడం ఆగడం తో అదే స్థలం లో సీసీ రోడ్డు పనులను మొదలు పెట్టడం జరిగింది. మల్కాజ్గిరి డివిజన్ సమగ్ర అభివృధికి పూర్తి స్థాయిలో పాటు పడుతునందుకు ఈ సందర్బంగా స్థానికులు మల్కాజ్గిరి కార్పొరేటర్ శ్రవణ్ ను అభినందించారు. సమస్య తీవ్రత వల్ల ప్రత్యేక నిధుల ద్వారా ఈ పనులను చేపడుతున్నట్లు మల్కాజ్గిరి కార్పొరేటర్ శ్రవణ్ తెలిపారు, ఇందుకు సహకరించిన మున్సిపల్ అడ్మినిస్ట్రేషయిన్ రాష్ట్ర కార్యదర్శి ఇలాంబర్తి ( %xూూ%) గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేసారు. ఈ కార్యక్రమం లో ఏ.ఈ నవీన్,రమేష్, శ్యామల, ప్రేమ్, రవి, బన్ సోడే, సూరజ్ సింగ్,నందు యాదవ్, మురళి,బాబాన్ సింగ్, రాఘవేంద్ర, నవీన్, పవన్, ఎస్. పి రాజ్, వెంకటేష్, కుమార్, సతీష్ మరియు పెద్ద ఎత్తున కాలనీ వాసులు పాల్గొన్నారు.

# భోదన అభ్యసన పద్ధతుల్ని తరగతిగదిలో అమలు పరచాలి

● **మండల విద్యాదికారి నర్సింగ్ రావు**



పెద్దేముల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలూర ఉన్నత పాఠశాలలో గత ఐదు రోజులుగా జరిగిన ఎఫ్ఎల్ఎన్ ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమం శనివారం నాడు ముగిసింది.ఈ కార్యక్రమములో మండల విద్యాదికారి నర్సింగ్ రావు మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న బోధన అభ్యాస పద్ధతుల్ని ఉపాధ్యాయులందరూ తరగతి గదిలో అమలు చేసి విద్యార్థుల స్థాయిని పెంచడానికి కృషి చేయాలన్నారు.పాఠశాలల్లోని గ్రంథాలయంలో పుస్తకాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచి వారిలో పఠనశక్తిని పెంపొందించాలన్నారు.బాల్య దశ నుండే విద్యార్థుల్లో దేశభక్తి,క్రమశిక్షణను మంచి అలవాట్లను కలుగజేసే కార్యక్రమలను రూపొందించి చదువుల పట్ల పాఠశాల పట్ల వారికీ ఆసక్తిని జీవితంలో ఉన్నత దశకు చేరేందుకు ఉపాధ్యాయులందరూ ప్రయత్నించాలన్నారు. ఉపాధ్యాయులందరూ సమయపాలన పాటించి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలన్నారు. ముగింపు కార్యక్రమములో ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కార్యక్రమన్ని విజయవంతంగా నిర్వహించిన మండల రిసోర్స్ పర్సన్లు బందెప్ప,నర్సిరెడ్డి, విజయ, నర్సిములు, శోభన్‌బాబు, నర్సిములు, రహమత్,రమేష్, రాఘవేందర్ లను మండల విద్యాదికారి మరియు శిక్షణ కేంద్రం ఇంచార్జి ద్యావరి నరేందర్ రెడ్డి సమక్షంలో ఎఫ్ఎల్ఎన్ శిక్షణా కేంద్రం తారపున సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మండల విద్యా వానరుల కేంద్రం సిబ్బంది, మండల రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

# యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో జన్మదిన సందర్భంగా కేక్ కటింగ్. స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



భువనగిరి పట్టణంలో పిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ గారి జన్మదిన సందర్భంగా ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో జన్మదిన వేడుకలు సందర్భంగా ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారి చేతుల మీదుగా కేక్ కట్ చేసి నారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘ నాయకులుగా ఎన్ ఎస్ యు ఐ విభాగం రాష్ట్ర అధ్యక్షులుగా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీగా కాంగ్రెస్ పార్టీ జిల్లా రాష్ట్రస్థాయి జనరల్ సెక్రెటరీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాష్ట్ర రథసారథి పీసీసీ అధ్యక్షులు గా శాసనసభ మండలి సభ్యులుగాబడుగు బలహీన నాయకుడు అంచలంచలుగా ఎదగాలని మరిన్ని ఉన్నత పదవులు రావాలని.శ్రీ యాదగిరి లక్ష్మీనరసింహస్వామి రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు తో ఆయురారోగ్యాలతో ఉన్నత పదవులు ఆదరించాలని కోరుకుంటున్నాం జై కాంగ్రెస్ కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో నిర్వహించినాము పిసిసి జనరల్ సెక్రెటరీ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ కొరకు ఎన్నో కార్యక్రమాలు నిర్వహించినారు కింది స్థాయి నుంచి ఎన్ ఎస్ యు ఐ స్టేట్ అధ్యక్షుడిగా ఆలిండియా జనరల్ సెక్రెటరీ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ కాంగ్రెస్ పార్టీ వారికి వర్కింగ్ ప్రెసిడెంట్ అలాగే రాష్ట్ర అధ్యక్షులుగా నియమించినారు ఎమ్మెల్సీగా మరియు పార్టీ బలోపేతం కొరకు కష్టపడుతూ రోజుల్లో స్థానిక సంస్థల్లో సత్తా చార్ట్ ఎందుకు కార్యకర్తల సందర్బంగా ఈరోజు రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం గ్యాస్ సబ్సిడీ రైతులకు రుణమాఫీ హాస్టల్ విద్యార్థులకు కాస్మెటిక్ చార్జీలు ఇంద్రమ్మ ఇల్లు 5 లక్షల లోను రాజీవ్ యువ వికాస్ లోన్లు పెంచడం సంవత్సరం నర వరకు దాదాపు 60 వేల ఉద్యోగాలు రిక్రూట్మెంట్ చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వం మన ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి గారి నాయకత్వం బట్టి గారి నాయకత్వం కోమటిరెడ్డి వెంకటరెడ్డి నాయకత్వంలో పనిచేస్తూ రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతం కొరకు ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ అవేచిస్తే భువనగిరి పట్టణ అధ్యక్షులు కూర వెంకటేష్ రాష్ట్ర సేవ దళ్ కార్యదర్శి పిట్టల బాలరాజ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చిక్కుల వెంకటేష్ మండల అధ్యక్షులు ఎలిమినేటి కృష్ణారెడ్డి టౌన్ అధ్యక్షులు సేవాదళ్ డా కూర్ ప్రకాష్ రవీందర్ పడిగెల ప్రదీప్ యూత్ కాంగ్రెస్ నాయకులు మంగ ప్రవీణ్ కొండల్ఎండి లైక్ అహ్మద్ పెంట ప్రవీణ్ సల్లవుద్దిన్ ఎండి అలీ శివ మండల అధ్యక్షులు నాలం కృష్ణ బాంబే శీను తాడూరి నరసింహా రఘుబాబు బెండ లాల్ రాజ్ సాలూరు ఉపేందర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఎస్ఐ



**మేడ్చల్ (మన వెలుగు) మే 24 :**

లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఎస్ఐఏసీబీకి చిక్కిన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషనులో చోటు చేసుకుంది.

ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... బల్కంపేటకి చెందిన హరి కమల్ బ్యాండ్ సిబ్బంది జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ శుభకార్యకానికి హాజరై బ్యాండ్ వాయించారు. కాగా శబ్ద కాలుష్యానికి పాలపడుతున్నారని ఆ బ్యాండ్ కు చెందిన వాహనాన్ని సామాగ్రిని ఎస్సై శంకర్ సీజ్ చేసాడు.. ఆవాహనాన్ని సామాగ్రిని హరికమల్ బ్యాండ్ సిబ్బందికి తిరిగి ఇచ్చేందుకు 15 వేల రూపాయలు డిమాండ్ చేశాడు. ఆ మొత్తాన్ని జగద్గిరిగుట్టకు చెందిన నాగేందర్ ను మధ్యవర్తిగా పెట్టుకొని, ఆ మొత్తాన్ని తనకు ఇవ్వాలని బాధితులను కోరాడు. ఎస్సై వేధింపులు తాళలేక, బాధితుడు ఏసీబీ కి ఫిర్యాదు చేయగా, ఎస్సై డిమాండ్ మేరకు ఈ రోజు ఉదయం బాధితుడు 15 వేల రూపాయల నగదును మధ్యవర్తి నాగేందర్ కు అందజేశారు. అతడు ఆ మొత్తాన్ని ఎస్సై కు అందజేస్తుండగా ఏసీబీ అధికారులు వలపన్ని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. అవినీతికి పాల్పడిన ఎస్సై శంకర్, అతనికి సహకరించిన నాగేందర్ పై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# అహల్య భాయ్ హొల్కర్ 300వ జయంతి





**- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ**

**నిజామాబాద్ ప్రతినిధి ( మన వెలుగు) మే 24 :**

అహల్య బాయ్ హొల్కర్ 300వ జయంతి సందర్బంగా నీలకంఠేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజ, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా హాజరై మాట్లాడారు. అహల్యాబాయి హొల్కర్ హిందూ దేవాలయాలకు మార్గదర్శకురాలు, నిర్మాణకర్త అని అన్నారు. దేశంలో ద్వారక మొదలుకొని వారణాసి, ఉజ్జయిని, నాసిక్, గయ, వైద్యనాథ్ ఆలయం (మహారాష్ట్ర) వంటి ప్రాంతాల్లో ధర్మశాలలు నిర్మాణం చేపట్టిందన్నారు. ప్రసిద్ధ కాశీ విశ్వనాథ ఆలయ పునరుద్ధరణలో ఆమె కృషి ఎంతో ఉందన్నారు. హిందువులపై, హిందూ దేవాలయాలపైన జరుగుతున్నా దాడులను అందరం సంఘటితమై ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాగోళ్ళ లక్ష్మినారాయణ, ప్రోగ్రాం కన్వీనర్ పోతంకర్ లక్ష్మినారాయణ, కో కన్వీనర్ ప్రవళిక, స్రవంతి, జ్యోతి బీజేపీ మండల అధ్యక్షులు, కార్పొరేటర్లు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు





**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 24 :**

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పుట్టినరోజు సందర్భంగా నిజామాబాద్ రూరల్ క్యాంపు కార్యాల యంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించడం జరిగింది. సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూనే పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి మహేష్ కుమార్ గౌడ్ చేస్తున్న కృషిని విజయవంతం చేస్తూ పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తల పైన ఉందని అని అన్నారు.

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ బీసీ నాయకుడిగా ఎంతో ఎత్తుకు ఎదిగి అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కొరకు కృషి చేస్తూనే అన్ని వర్గాలను సమానంగా చూస్తున్న నాయకుడు అని మహేష్ కుమార్ గౌడ్ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ దేవుని కోరుకుంటు న్నారు.ఈ కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ శేఖర్ గౌడ్ , డిసిపల్లి అధ్యక్షులు పోలసాని శ్రీనివాస్, రూరల్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉమ్మాజీ నరేష్ నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ మండలాల అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఏకపక్షంగా ఎన్ కౌంటర్లు

**కూనంనేని సాంబశివరావు**

ఛత్తీస్ ఘడ్ లో సిపిఐ మావోయిస్టు ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు తో సహ మరో 27 మంది మావోయిస్టులను ఎన్ కౌంటర్ చేయడం పట్ల సిపిఐ తీవ్రంగా ఖండిస్తున్నదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. శాంతి చర్చలకు సిద్ధమేనని మావోయిస్టులు ప్రకటించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా ఏకపక్షంగా ఎన్ కౌంటర్లు చేయడం అప్రజాస్వామికమని ఆయన పేర్కొన్నారు. సమాజంలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాస్వామిక వాదులు, అభ్యుదయ వాదులు, మేధావులు రచయితలు తక్షణమే మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కోరుతున్నప్పటికీ కేంద్రం మొండివైఖరి ప్రదర్శించడాన్నీ తీవ్రంగా ఖండించారు. ఎలాంటి

# విజయ్ రౌడీ జనార్ధన్‌లో కీర్తి సురేశ





'మహానటి' చిత్రంతో జాతీయ ఉత్తమ నటిగా గుర్తింపు పొందిన కీర్తి సురేష్ గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే అవుతుంది. గ్లామర్ పాత్రలకు దూరంగా ఉండి, నటనకు ప్రాధాన్యమున్న చిత్రాలను ఎంచుకున్న కీర్తి సడెన్‌గా, తన పాత్రల ఎంపిక విషయంలో రూట్ మార్చింది. తన 'వెర్షన్ 2.0' ని ఆవిష్కరించేందుకు సిద్ధమవుతున్నట్టు– తెలుస్తోంది. ఈ మార్పుకు నిదర్శనం విజయ్ దేవరకొండతో ఆమె నటించబోయే సినిమా 'రౌడీ జనార్దన్' అని చెప్పాలి. రవికిరణ్ కోలా దర్శకత్వంలో దిల్ రాజు నిర్మిస్తున్న ఈ 'రౌడీ జనార్దన్' చిత్రంలో కీర్తి సురేష్ రొమాంటిక్ పాత్రలో కనిపించబోతుంది. అంతే కాదు ఈ చిత్రంలో విజయ్ దేవరకొండతో లిప్ లాక్ సన్నివేశాలు కూడా ఉండవచ్చని పుకార్లు వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు కీర్తి సురేష్ ఏ హీరోతో లిప్ లాక్ సన్నివేశాల్లో నటించలేదు. 'సర్కారు వారి పాట' చిత్రంలో మహేష్ బాబుతో రొమాంటిక్ సన్నివేశాలు ఉన్నప్పటికీ లిప్ లాక్ మాత్రం లేదు. మరి, 'రౌడీ జనార్దన్' లో మాత్రం ఇది నిజం కావచ్చని అంచనా వేస్తున్నారు. ఎందుకంటే ప్రజంట్ కీర్తి ఐడియాలజీ మొత్తం చేంజ్ అయ్యింది.. తన కెరీర్‌లో ప్రయోగాలు చేయడానికి వెనుకాడటం లేదు. నెట్‌ప్లిక్స్ కోసం 'అక్క' అనే వెబ్ సిరీస్‌లో బోల్డ్‌గా నటించబోతున్నట్లు తెలుస్తుంది. పాత పద్ధతిలో వెళితే పని అవ్వదని గ్రహించిన ఈ అమ్మడు రూట్ మార్చినట్లు– తెలుస్తుంది.

# ప్రభాస్ ..సో కూల్ మ్యాన్

## మాళవిక ఆసక్తికర వ్యాఖ్యలు



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ గురించి మాళవిక షాకింగ్ కామెంట్స్ చేసింది. ఆమె చేసిన కామెంట్లు– ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. వీరిద్దరూ కలిసి ది రాజాసాబ్ మూవీలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ప్రభాస్ గురించి బయట విని నిజంగా అతను చాలా సైలెంట్ గా ఉంటాడేమో.. ఎలా మాట్లాడాలి అనుకుంటూఉన్నాను. కానీ నా అంచనాలు పూర్తిగా ఫెయిల్ అయింది. ఎందుకంటే ప్రభాస్ చాలా సింపుల్ గా అందరికీ సరదాగా ఉంటారు. అంత పెద్ద స్టార్ అయినా సరే ఎలాంటి ప్రౌడ్ ఉండదు. అందరితో కలిసి సరదాగా మాట్లాడుతూ కనిపిస్తారు. ఆయన సెట్ లో ఉన్నంత సేపు సందడిగా ఉంటుంది. అస్సలు బోర్ కొట్టదు. జోక్స్ వేసి నవ్విస్తారు. ఎలాంటి వారిని అయినా ఒకే విధంగా పలకరిస్తారు' అంటూ చెప్పుకొచ్చింది మాళవిక. త్వరలోనే రాజాసాబ్ టీజర్ రిలీజ్ అయ్యే అవకాశాలు ఉన్నాయని అంటూ తెలిపింది. మారుతి డైరెక్షన్ లో వస్తున్న ఈ సినిమాపై మంచి అంచనాలు ఉన్నాయి. ఫస్ట్ –టైమ్ ఇందులో ప్రభాస్ హ(ర్రర్ సినిమాలో కనిపిస్తున్నారు. రీసెంట్ గానే డబ్బింగ్ వర్క్ స్టార్ట్ అయింది. త్వరలోనే టీ–జర్ వస్తుందనే వార్తలు వినిపిస్తున్నాయి. రీసెంట్ గానే హాలిడే ట్రిప్ నుంచి ప్రభాస్ ఇంటికి వచ్చిన సంగతి తెలిసిందే. వచ్చిన వెంటనే రాజాసాబ్ పనుల్లో బిజీగా గడుపుతున్నాడు.



# ప్రశాంత్ వర్మను ఆడేసుకుంటున్న నెటిజన్లు



డైరెక్టర్ ప్రశాంత్ వర్మ 'హను మాన్' సినిమాతో సంచలనం సృష్టించాడు. దీంతో వర్మ రేంజ్ ఒక్కసారిగా మారిపోయింది. టాలీవుడ్ లో మాత్రమే కాదు.. బాలీవుడ్ కూడా అతని టాలెంట్ గుర్తించింది. అయితే తన డైరెక్షన్‌లో ఎనౌన్స్ చేసిన అధీర, జై హనుమాన్ ఎంత వరకు వచ్చాయో అప్డేట్ లేదు. కథ అందించిన 'మహాకాళి' కి హీరోయిన్ ఫిక్స్ కాలేదు. ప్రభాస్‌తో మూవీ అంటూ వార్తలొచ్చాయి.. ఉందో లేదో కూడా తెలియదు. మరీ హనుమాన్ డైరెక్టర్ ఏం చేస్తున్నట్లు–..? జై హనుమాన్, అధీరా ఈ రెండు సినిమాలకు కనీసం హీరో ఎవరో ఆడియన్స్‌కు తెలుసు. కానీ ఈ లేడీ ఓరియెం–టె–డ్ ప్రాజెక్ట్ 'మహాకాళి' లో ఫిమేల్ లీడ్ ఎవరో తెలియదు. ఇక హనుమాన్ జయంతి రోజున, జై హనుమాన్ మూవీ అప్డేట్ ఇస్తాడేమో, అనుకుని చూస్తున్న ఆడియన్స్‌కు పెద్ద షాక్ ఇచ్చాడు ప్రశాంత్. మూవీలకు కామ పెట్టి పీవీసీయు అనే క్లాతింగ్ వెబ్ సైట్ స్టార్ట్ చేశారు. ఇక ఈ ఎనౌన్స్ మెంట్ చూసిన మూవీ లవర్స్‌కు కోపం కట్టలు తెంచుకుంది .దీంతో నెటిజన్లు మండిపడుతున్నారు.

# గేమ్‌ఛేంజర్ ఏడున్నర గంటల నిడివి

## చిత్ర ఎడిటర్ షమీర్ కీలక వ్యాఖ్యలు




రామ్‌చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వం వహించిన చిత్రం 'గేమ్ ఛేంజర్' చిత్రాన్ని ఉద్దేశించి చిత్ర ఎడిటర్ షమీర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సినిమా నిడివి ఏడున్నర గంటలన్నారు. శంకర్‌తో వర్క్ చేయడం తనకు మంచి అనుభూతిని అందించలేదన్నారు. గేమ్‌ఛేంజర్'కు ఎడిటర్‌గా నేను కొంతకాలం వర్క్ చేశా. నేను వర్క్ చేసినప్పుడు ఆ సినిమా నిడివి సుమారు ఏడున్నర గంటలు. దానిని నేను మూడు గంటలకు ట్రిమ్ చేశా. మూడేళ్ల తర్వాత నాకు వేరే కమిట్‌మెంట్స్ ఉండటం వల్ల ఈ ప్రాజెక్ట్ నుంచి పక్కకు జరగాల్సి వచ్చింది. దురదృష్టవశాత్తూ ఇది నాకు సరైన అనుభూతిని అందించలేదని షమీర్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. 'గేమ్ ఛేంజర్' నిడివి గురించి ఎడిటర్ చెప్పిన మాటలు తమని షాక్‌కు గురిచేస్తున్నాయని నెటిజన్లు అంటున్నారు. నేను అనుకున్న దానిప్రకారం ఈ సినిమా నిడివి 5 గంటల వరకు ఉండాలి. సమయాభావం వల్ల కొన్ని సీన్స్ కట్ చేయాల్సివచ్చింది. దీంతో కథ అనుకున్నవిధంగా రాలేదని శంకర్ అన్నారు.

# సినిమాహాళ్ల బంద్ నిర్ణయం తప్పు

## పవన్ సినిమాకు ముందే ఎందుకీ దురాలోచన


## మండిపడ్డ మంత్రి కందుల దుర్గేశ్



జూన్ 1వ తేదీ నుంచి సినిమా హాళ్లు బంద్ చేయాలని ఎగ్జిబిటర్లు తీసుకున్న నిర్ణయంపై విచారణ చేపట్టాలని రాష్ట్ర సినిమాటోగ్రఫీ, పర్యాటక శాఖ మంత్రికందుల దుర్గేష్ ఆదేశిచారు. అసలు డిప్యూటీ–సీఎం పవన్ కల్యాణ్ సినిమా రిలీజ్ సమయంలోనే ఇలాంటి నిర్ణయం ఎందుకు అని ప్రశ్నించారు. . హరిహర వీరమల్లు సినిమా విడుదలకు ముందు థియేటర్లు మూసి వేయాలని ఎందుకు నిర్ణయం తీసుకున్నారో తెలుసుకోవడం కోసమే విచారణ అన్నారు.. ఈ నిర్ణయం వెనుక ఎవరు ఉన్నారో తెలుసుకోవాలని హోం శాఖ ముఖ్య కార్యదర్శికి దిశానిర్దేశం చేసినట్లు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి తెలియచేయకుండా ఎందుకు ఈ నిర్ణయం తీసుకున్నారో తెలుసుకోవడం కోసమేనని అని.. సినిమా ఇండస్ట్రీకి సంబంధించి అన్ని రకాల సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. సినిమా రంగానికి సంబంధించిన ఏ సమస్యనైనా సానుకూలంగా పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.. రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించకుండా జూన్ 1 నుండి థియేటర్లు మూసివేయాలని ఎగ్జిబిటర్లు తీసుకున్న నిర్ణయం సరైంది కాదని హితవుచెప్పారు.. సినిమా రంగానికి సంబంధించి ఒక కొత్త పాలసీను కూడా తీసుకురాబోతున్నాం అని వెల్లడించారు.. సినీ పరిశ్రమనికి ప్రభుత్వం తరపునుంచి పూర్తి సహకారం ఉంది... పర్సంటేజ్ పెంచాలని ఎగ్జిక్యూటర్స్ అడుగుతున్నారనేది తెలిసిందన్నారు. ఏపీ, తెలంగాణలో థియేటర్స్ అన్ని లీజుకు తీసుకొని నడుపుతున్నారు... హరిహర వీరమల్లు సినిమా విడుదలకు ముందు ఈ వాతావరణం ఎందుకు వచ్చిందని చాలామంది అడుగుతున్నారని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.. ఎంక్వయిరీ మొదలైంది. ఎగ్జిబిటర్స్, డిస్ట్రిబ్యూటర్స్, ప్రొడ్యూసర్స్.. సంపూర్ణంగా వారికీ ఉపయోగపడే వాతావరణాన్ని ఇవ్వడానికి డిప్యూటీ– సీఎం పవన్ కల్యాణ్ సముఖంగా ఉన్నారు.. సినిమా రేట్ల విషయంలో కూడా ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఎన్టీవీకి వెల్లడించారు.

# బాలీవుడ్ నటుడు ముకుల్ దేవ్ కన్నుమూత

## సంతాపం తెలిపిన జూనియర్ ఎన్టీఆర్ తదితరులు



బాలీవుడ్ నటుడు ముకుల్ దేవ్ (54) కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఇబ్బందిపడుతున్న ఆయన ముంబయిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందారని కుటుంబసభ్యులు, సన్నిహితులు ఈ విషయాన్ని తెలియజేశారు. ముకుల్ దేవ్ మరణం దిగ్భ్రాంతికి గురిచేసిందంటూ సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు. ముకుల్ దేవ్‌తో ఉన్న అనుబంధాన్ని టాలీవుడ్ హీరో ఎన్టీఆర్ గుర్తుచేసుకున్నారు. ముకుల్ మరణించడం బాధాకరం.'అదుర్స్'లో ఆయనతోపాటు– వర్క్ చేసినప్పుడు ఆయన నిబద్ధత తెలిసింది. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నా అని ఎక్స్ వేదికగా విచారం వ్యక్తం చేశారు. ముకుల్‌ను గుర్తుచేసుకుంటూ బాలీవుడ్ ప్రముఖులు పోస్ట్‌లు పెడుతున్నారు. ఆయన ఇక లేరనే విషయాన్ని నమ్మలేకపోతున్నట్లు– మనోజ్ బాజ్‌పాయ్ విచారం వ్యక్తం చేశారు. గొప్ప కళాకారుడని.. కాలం ఆయన్ని త్వరగా తీసుకెళ్లిపోయిందన్నారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు. ముకుల్ ఆత్మకు శాంతి చేకూరాలని సోనూసూద్ పోస్ట్ పెట్టారు. 'సింహాద్రి', 'సీతయ్య', 'మాస్' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను అలరించిన నటుడు రాహుల్ దేవ్ సోదరుడే ముకుల్. సీరియల్ నటుడిగా కెరీర్‌ను మొదలుపెట్టిన ముకుల్ పలు హిందీ సినిమాల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్నారు. 'దస్తక్'తో నటుడిగా వెండితెరకు పరిచమైన ఆయన బాలీవుడ్‌లోనే కాకుండా తెలుగు, పంజాబీ, కన్నడ చిత్రాల్లోనూ నటించారు. రవితేజ హీరోగా నటించిన 'కృష్ణ'తో విలన్‌గా తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. ఆ సినిమా తర్వాత 'కేడి', 'అదుర్స్', 'సిద్ధం', 'మనీ మనీ మోర్ మనీ', 'నిప్పు', 'భాయ్' చిత్రాల్లో నటించారు. 2022లో విడుదలైన 'అంత్ ది ఎండ్' తర్వాత ఆయన సినిమాల్లో కనిపించలేదు.

# 'కన్నప్ప' విషయంలో చేసిన పెద్ద తప్పు అదే: మంచు విష్ణు



మంచు విష్ణు ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'కన్నప్ప' . ముకేశ్ కుమార్‌సింగ్ దర్శకత్వం వహించారు. ప్రీతి ముకుందన్ కథానాయిక. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా మంచు విష్ణుతో నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ ఇంటర్వ్యూ చేశారు. ఈ సినిమా వల్ల తాను ఎన్నో విషయాలు నేర్చుకున్నానని చెప్పారు. వీఎఫ్ఎక్స్ వర్క్ వల్లే సినిమా ఆలస్యమైందని చెప్పారు."2014లో తనికెళ్ల భరణి గారు కన్నప్ప ఐడియా చెప్పారు. ఆయన చెప్పిన ఐడియా నాకెంతో నచ్చింది. విదేశాల నుంచి నిపుణులను పిలిపించి దీనిని డెవలప్ చేయించా. కొన్ని నెలలకే ఆయన నా అభిరుచిని గమనించి.. భారీ స్థాయిలో సినిమా చేయమన్నారు. ఆ కథ తీసుకుని నా వెర్షన్‌లో దానిని సిద్ధం చేయించా. రూ.100 కోట్ల లోపే బడ్జెట్ అవుతుందనుకున్నా. కానీ, అనుకున్న దాని కంటే రెట్టింపు ఖర్చు అయింది. 'మహాభారత్' తీసిన దర్శకుడు ముకేశ్‌కుమార్ సింగ్ ఈ చిత్రాన్ని రూపొందిస్తే బాగుంటుందని నాన్నే చెప్పారు. శివుడి ఆజ్ఞ, నా తండ్రి ఇచ్చిన సపోర్ట్‌తోనే నేను ఇదంతా చేయగలిగా. టీమ్‌లో పనిచేసిన ప్రతి ఒక్కరూ నాకెంతో అండగా నిలిచారు. ఈ సినిమా విషయంలో నన్నెంతో సపోర్ట్ చేసి, ప్రోత్సహించిన వ్యక్తి ప్రభాస్. తనకి ఎప్పటికీ రుణపడి ఉంటా. ప్రభాస్ పోషించిన విభిన్న పాత్రల్లో రుద్ర పాత్ర మైలు రాయిగా నిలిచిపోతుంది. నాన్నకు ప్రభాస్‌కు మధ్య ఓ సన్నివేశం ఉంటుంది. అది చాలా హైలైట్‌గా నిలుస్తుంది" అని మంచు విష్ణు చెప్పారు. తనకు కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించడం ఇష్టమన్న విష్ణు.. ఈ సినిమాకు వీఎఫ్ఎక్స్‌లో సరైన ప్రావీణ్యం లేని వ్యక్తిని తీసుకున్నానని అందుకే ఇది ఆలస్యమైందన్నారు. అదే తాను చేసిన పెద్ద తప్పు అని చెప్పారు. అనుకున్న సమయానికి రిలీజ్ చేసేందుకు టీమ్ ఎంతగానో శ్రమిస్తుందన్నారు.ఇదే ఇంటర్వ్యూలో మోహన్‌బాబు కుటుంబంలో నెలకొన్న వివాదాల గురించి తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడారు. వివాదాలు చూస్తుంటే తనకెంతో బాధగా అనిపిస్తుందని చెప్పారు. 'కన్నప్ప' విడుదలయ్యాక కుటుంబసభ్యులందరూ ఒకచోట కూర్చొని సమస్యను పరిష్కరించుకోవాలని ఆయన అన్నారు. కావాలంటే ఈ విషయంలో తాను పెద్దరికం తీసుకుంటానని చెప్పారు. దీనిపై స్పందించిన విష్ణు.. "మీ మాటలు నేను గౌరవిస్తాను. గొడవలు జరిగిన కొన్నిరోజులకే మీరు నాకు ఫోన్ చేశారు. ఏం జరుగుతుంది అసలు అని అడిగారు. దానిని నేనెప్పటికీ మర్చిపోను. ఇండస్ట్రీ ఒక కుటుంబం. భేదాభిప్రాయాలు ఉండొచ్చు. మీ సలహాలు తీసుకుంటా. మీ మాటలు నేను ఫాలో అవుతా" అని చెప్పారు.